సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 21 । మార్చి । 2025




ఆదుకోకోంటే ఉద్యమమే

కోకో గింజల కొనుగోలు సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని కోకో రైతులు హెచ్చరించారు. 8లో ▸



నకిలీ బంగారం ముఠా అరెస్ట్

నకిలీ బంగారం అంటగడుతూ ఏలూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో మోసాలకు పాల్పడిన ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో ▸



న్యూస్‌రీల్

క్షీరారామం హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం (క్షీరారామం)లో హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 105 రోజులకు రూ.15,01,481 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాస్ తెలిపారు. దేవదాయశాఖ భీమవరం డివిజన్ ఇన్‌స్పెక్టర్ వర్దినీడి వెంకటేశ్వరరావు, ఈఓలు రంగరాజన్, నాగజ్యోతి పర్యవేక్షించారు.

చినఅమిరం పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ అరెస్ట్

భీమవరం: భీమవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భీమవరం మండలం చినఅమిరం పంచాయతీలో నిధులు దుర్వినియోగం కేసులో జూనియర్ అసిస్టెంట్ గుండు రామకృష్ణను గురువారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. నిందితుడిని రెండో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా 15 రోజుల రిమాండ్ విధించారన్నారు. మండలంలోని చినఅమిరం, రాయలం గ్రామాల్లో గతంలో పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన సాగి కిషోర్ కుమార్‌రాజు, దున్న జయరాజుల హయాంలో సుమారు రూ.2.16 కోట్లు దుర్వినియోగం జరిగినట్లు అధికారులు నిర్ధారించగా ఈనెల 12న కిషోర్ కుమార్‌రాజు, జయరాజులను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

సీడబ్ల్యూసీకి చిన్నారులు



చిన్నారులు సాత్విక్, కరుణ సత్యను సీడబ్ల్యూసీకి తరలిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: మారుటి తండ్రి దాడిలో గాయపడి, చికిత్స పొందుతూ కోలుకున్న చిన్నారులను గురువారం ఐసీడీఎస్ అధికారులు సీడబ్ల్యూసీ (చైల్డ్ వెల్ఫేర్ కమిటీ) ముందు హాజరు పరిచారు. జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ సీడీపీఓ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్న ఎ.జోత్స్న భర్త నుంచి విడిపోయి రెండో వివాహం చేసుకుంది. మొదటి భర్త ద్వారా కలిగిన సంతానం సాత్విక్ (11), కరుణ సత్య (8)తో కలిసి రెండో భర్త పి.దుర్గాప్రసాద్ వద్ద ఉంటోంది. ఇటీవల మారుటి తండ్రి దుర్గాప్రసాద్ మద్యం సేవించి వచ్చి చిన్నారులను తీవ్రంగా కొట్టడంతో గాయపడిన సాత్విక్‌కు జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందించారు. పోలీసు శాఖ, ఐసీడీఎస్ అధికారులు సాత్విక్, కరుణ సత్యలను జీఎంఎస్‌కే గంగారత్నం ద్వారా ఏలూరు సీడబ్ల్యూసీ ముందు హాజరు పరిచారు. సీడబ్ల్యూసీ నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని బ్యూల తెలిపారు.

అందుబాటులో టీచర్ల సీనియార్టీ జాబితా

ఏలూరు(ఆర్ఆర్‌పేట): పూర్వ పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, మున్సిపాల్టీ, కార్పొరేషన్ల యాజమాన్యాల్లో పనిచేస్తున్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా రూపొందించామని డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ ప్రకటనలో తెలిపారు. జాబితాను పూర్వ పశ్చిమగోదావరి జిల్లా పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో, నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచామన్నారు. జాబితాపై ఎవరైనా అభ్యంతరాలుంటే ఈనెల 25లోపు సమర్పించవచ్చన్నారు.

'ఆశ్రం' విద్యార్థుల ప్రతిభ

దెందులూరు: ఏలూరులోని ఆశ్రం వైద్య కళాశాల విద్యార్థులు 2024 ఎంబీబీఎస్ పరీక్షా ఫలితాల్లో సత్తాచాటారు. 257 మంది విద్యార్థులకు 238 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ చేబ్రోలు శ్రీనివాస్ తెలిపారు. ఫైనల్ ఎంబీబీఎస్ పార్ట్-1లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

తాగునీటి సమస్య తలెత్తితే ఊరుకోం

ఏలూరు(మెట్రో): రానున్న వేసవిలో జిల్లాలో అధికారుల నిర్లక్ష్యంతో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే ఊరుకోబోమని ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో గురువారం తాగునీటి సరఫరా, జల్ జీవన్ మిషన్ పథకాల అమలుపై ఆమె సమీక్షించారు. తాగునీటికి సంబంధించి సమస్యాత్మక గ్రామాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి సరఫరాపై వారంలోపు కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని ఆదేశించారు.

మద్యంతర బాదుడు

ధరలు పెంచి.. పేదలను ముంచి..

- గత నెలలో బాటిల్‌కు రూ.10 వడ్డన
- తాజాగా సిండికేట్లు మరో రూ.10 పెంపు
- ఎమ్మార్పీకి మించి అమ్మకాలు
- జిల్లాలో మందుబాబులపై రోజుకు రూ.కోటికి పైగా భారం
- కూటమి నేతలు, ఎక్సైజ్ వర్గాలకు భారీగా ముడుపులు
- జిల్లాలో మద్యం ఆదాయం రోజుకు రూ.3.50 కోట్లు



పాలకొల్లులోని ఒక మద్యం దుకాణం వద్ద సిట్టింగ్

సాక్షి, భీమవరం: పేద, మధ్యతరగతి మందుబాబులే లక్ష్యంగా మద్యం సిండికేట్లు ధరలను పెంచేశాయి. మద్యం వ్యాపారుల కోసం గత నెలలో చంద్రబాబు సర్కారు బాటిల్‌పై రూ.10ల చొప్పున పెంచితే.. తాజాగా సిండికేట్లు మరో రూ.10 పెంచి విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారంలో తెరవెనుక సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు, ఎక్సైజ్ అధికారులకు భారీగానే ముడుపులు అందుతున్నట్టు సమాచారం.

ఎమ్మార్పీపై రూ.20 ఎక్స్‌ట్రా

లిక్కర్ సిండికేట్లకు మేలు చేసేలా అమ్మకాలపై 10 శాతంగా ఉన్న మార్జిన్‌ను గత నెలలో ప్రభుత్వం 14 శాతానికి పెంచింది. ఆ భారాన్ని మందుబాబులపై మోపుతూ మద్యం ధరలను 15 శాతం వరకు పెంచింది. దీంతో పేద, మధ్యతరగతి వర్గాల వారు అధికంగా సేవించే రూ.120, రూ.130, రూ.150, రూ.180, రూ.190 క్వార్టర్ బాటిళ్ల ధరలు రూ.10 వంతున పెరిగాయి. ఇది చాలదన్నట్టు జిల్లా కేంద్రమైన భీమవరం, ఇతర నియోజకవర్గాల్లో రూ.130 నుంచి రూ.210 వరకు ఉన్న బ్రాండ్లపై రూ.10లు అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం బాటిళ్లపై పాత ఎమ్మార్పీ ధరలే ఉండటంతో రూ.20 ఎక్స్‌ట్రా (గత నెలలో ప్రభుత్వం పెంచిన రూ.10, ఇప్పుడు సిండికేట్ పెంచిన రూ.10 కలిపి) వసూలు చేస్తున్నారు. రాత్రి 10 గంటలు దాటిన తర్వాత బ్రాండ్‌ను బట్టి ఈ ధరలను మరింత పెంచేస్తున్నారు. కూలింగ్ చార్జీల పేరిట బీర్లపై రూ.10 నుంచి రూ.20 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. అధికంగా వినియోగం ఉండే రూ.130 నుంచి రూ.210 మధ్య ఉన్న బ్రాండ్ల ధరలను ప్రధానంగా పెంచుతున్నట్టు తెలుస్తోంది. జిల్లాలో రోజుకు సుమారు రూ.3.50 కోట్ల మద్యం అమ్మకాలు జరుగుతుండగా రూ.20 ఎక్స్‌ట్రా రూపంలో మందుబాబులపై రూ.కోటికి పైగా అదనపు భారం పడుతోందని అంచనా.

పత్తాలేని రూ.99 బాటిళ్లు

పేదల కోసం అంటూ చంద్రబాబు ప్రకటించిన రూ.99 క్వార్టర్ బాటిళ్లు మద్యం దుకాణాల్లో కనిపించడం లేదు. వీటిపై వచ్చే మార్జిన్ తక్కువగా ఉండటంతో వ్యాపారులు అమ్మకాలకు ఆసక్తి చూపడం లేదు. రూ.99 బాటిళ్లు లేవని చెబుతుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో మందుబాబులు జేబులు గుల్ల చేసుకుంటున్నారు. భీమవరంలో ఎక్స్‌ట్రా ధరలపై ఎక్సైజ్ సీఐ బలరామరాజును ఫోన్‌లో సంప్రదించగా విషయం తమ దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

గత టీడీపీ హయాంలో విచ్చలవిడిగా సాగిన మద్యం అమ్మకాలకు గత వైఎస్సార్ ప్రభుత్వం క్లెం వేసింది. ప్రభుత్వ మద్యం పాలసీని తెచ్చి బెల్టుషాపులను అరికట్టడంతో పాటు నిర్దిష్ట వేళల్లో మాత్రమే అమ్మకాలు చేసేలా చర్యలు తీసుకుంది. షాపుల వద్ద మద్యం కొనుగోలు చేసి తీసుకువెళ్లడమే తప్ప అక్కడే తాగేందుకు వీలు లేకుండా చేసింది. ఎమ్మార్పీకి మించి అధిక ధరల ఊసే లేదు. అప్పట్లో ఊరి చివర ఎక్కడో ఉన్న మద్యం దుకాణాలు ఇప్పుడు జనావాసాల్లోకి వచ్చేశాయి. నాడు మద్యంపై వచ్చే ఆదాయం మొత్తం ప్రభుత్వ ఖజానాకు చేరితే ప్రస్తుతం కూటమి నేతలు, సిండికేటు వర్గాల జేబుల్లోకి వెళుతుండటం గమనార్హం.

జిల్లాలో 175 మద్యం దుకాణాలు

జిల్లాలో 175 మద్యం దుకాణాలు ఉండగా కూటమి సిండికేట్లు పర్యవేక్షణలోనే షాపుల నిర్వహణ సాగుతోంది. ఎక్సైజ్ పాలసీకి విరుద్ధంగా చాలా చోట్ల మద్యం దుకాణాలను బార్ అండ్ రెస్టారెంట్ల మాదిరి మార్చేశారు. షాపుల వద్దనే మద్యం సేవించేందుకు టేబుళ్లు, కుర్చీలతో సిట్టింగ్ ఏర్పాట్లు, మంచింగ్ కోసం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, సోడా, డ్రింక్, వాటర్ బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నారు. లూజ్ సేల్స్, బెల్టుషాపులు షరా మామూలే. నెలరోజుల క్రితం జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి భీమవరంలోని మద్యం షాపుల్లో స్వయంగా తనిఖీలు చేసి నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేయించినా పరిస్థితిలో మార్పు రాలేదన్న విమర్శలున్నాయి.



పెనుమంట్ర మండలంలోని ఓ దుకాణం వద్ద లూజ్ సేల్స్ కొలతల కోసం ఖాళీ బాటిల్

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం కావాలి

జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి



కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం: రైతుల నుంచి దాళ్వా ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై సేకరణ కమిటీ సభ్యులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ధాన్యం కనీస మద్దతు ధర సాధారణ రకం క్వింటాల్ రూ.2,300, గ్రేడ్-ఎ రకం రూ.2,320 ఉందన్నారు. తేమ శాతం 17 కంటే తక్కువ ఉండేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధర కంటే ఎక్కువ రేటు ఉంటే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవచ్చన్నారు. రైతు సేవా కేంద్రాల్లో తగినంత సిబ్బందిని నియమించి వారికి ధాన్యం కొనుగోలుపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. గోనె సంచులు, హమాలీలు, ధాన్యం రవాణాకు వాహనాలను అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరాం ప్రసాద్, డీఎస్‌ఓ ఎస్.సరోజ, జిల్లా సహకార శాఖ అధికారి ఎం.నాగరాజు, జిల్లా రవాణా శాఖ అధికారి బి.ఉమామహేశ్వరరావు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ వీవీ నాగరాజారావు తదితరులు పాల్గొన్నారు.

గళమెత్తిన విద్యుత్ మీటర్ రీడర్లు



భీమవరంలో ధర్నా చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు

భీమవరం: విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ మీటర్ రీడర్లను రోడ్డున పడేయవద్దని, వారికి సంస్థలోనే ప్రత్యామ్నాయం చూపి ఉద్యోగ భద్రత కల్పించాలంటూ భీమవరంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని చినరంగనిపాలెం యూనియన్ బ్యాంకు నుంచి ప్రదర్శనగా వెళ్లి విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ గతంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన మంత్రి లోకేష్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సంఘ భీమవరం డివిజన్ అధ్యక్షుడు పెనుమాక జాకబ్ మాట్లాడుతూ ఎస్క్రో ఖాతా ద్వారా వేతనాలు చెల్లిస్తామని గతంలో సంస్థ సీఎండీ మీటర్ రీడర్లకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మీటర్ రీడర్లలో అర్హత ఉన్న వారిని సబ్ స్టేషన్లలో షిఫ్ట్ ఆపరేటర్‌గా, వాచ్ అండ్ వార్డ్‌గా, సర్కిల్ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్స్, అటెండర్స్, వాచ్‌మెన్స్‌గా నియమించాలని కోరారు. మూడు కంపెనీల పరిధిలో ఒకే పని దినాలు అమలు చేయాలని, అదనపు పని గంటలను రద్దు చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని విద్యుత్ ఎస్ఈ ఆలపాటి రఘునాథ్‌బాబు, డీఈ నరహరిశెట్టి వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాంప్రసాద్, విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తగదు



భీమవరంలో ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడాన్ని నిరసిస్తూ భీమవరంలో గురువారం మాలసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కూటమి ప్రభుత్వం మద్దతు ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తప్పుల తడకగా ఉన్న రాజీవ్ రంజన్‌మిశ్రా కమిషన్‌ను రద్దు చేసి హైకోర్టు జడ్జిలతో త్రిసభ్య కమిటీ వేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ బిల్లుకు మద్దతు ఇవ్వడం మాలలను అణగదొక్కడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో మాలల జనాభా అధికమని మిశ్రా కమిషన్ మాలలను తక్కువగా చూపి ప్రభుత్వానికి తప్పుడు నివేదిక ఇచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లెళ్ల సుధామ, కేసీ రాజు, సుంకర సీతారామ్, గొల్ల రాజ్‌కుమార్, అంబటి ఆనందకుమార్, చింతల నాగరాజు, ఈర్లపాటి గోపి తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద ఉద్రిక్తత

- గుర్తుతెలియని వ్యక్తి దాడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి
- మృతదేహాన్ని స్వగ్రామానికి తరలిస్తుండగా కుటుంబసభ్యుల ఆందోళన



జీలుగుమిల్లిలో రోడ్డుపై బైఠాయించిన బంధువులకు నచ్చచెబుతున్న పోలీసులు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లిలోని అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రెండు రోజుల క్రితం జీలుగుమిల్లి మండలం తాటాకుల గూడేనికి చెందిన గంధం బోసు అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేయగా ఖమ్మంలో చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. మృతదేహాన్ని గురువారం ఖమ్మం నుంచి బోసు స్వగ్రామానికి తీసుకువస్తుండగా తెలంగాణ, ఆంధ్ర సరిహద్దు వద్ద కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. బోసు మృతికి కారణాలు తేల్చాలంటూ భీష్మించారు. సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్సైలు నవీన్‌కుమార్, చంద్రశేఖర్ ఆందోళనకారులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో పోలీసులకు, కుటుంబ సభ్యులకు వాదోపవాదం జరిగింది. రాత్రి సమయానికి కూడా ఆందోళన కొనసాగడంతో సరిహద్దు వద్ద కిలోమీటరుకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు అక్కడికి చేరుకుని శుక్రవారం నాటికి నిందితులెవరో తేలుస్తామని చెప్పడంతో కుటుంబసభ్యులు ఆందోళన విరమించారు. బోసు మృతదేహాన్ని స్వగ్రామం తరలిస్తున్న సమయంలో కూడా పోలీసులు వెంటే ఉన్నారు. మృతదేహానికి శుక్రవారం అంత్యక్రియలు చేస్తామని బంధువులు తెలిపారు. ఇదిలా ఉండా బోసుపై దాడి కేసులో అనుమానితులను పోలీసులు ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది. దోషులను ప్రభుత్వం వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు డిమాండ్ చేశారు.

స్వచ్ఛంద సంస్థలు భాగం కావాలి

ఏలూరు (టూటౌన్): గ్రామస్థాయి బాలల వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ కమిటీల్లో స్వచ్ఛంద సేవా సంస్థలు భాగస్వాములు కావాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు జె.రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా గ్రామస్థాయిలో ఏర్పాటు చేస్తున్న బాలల సంక్షేమ, రక్షణ సమన్వయ కమిటీల్లో స్వచ్ఛంద సేవా సంస్థలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సీడబ్ల్యూసీ ఇన్‌చార్జి చైర్మన్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. పశ్చిమగోదావరి జిల్లా ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కార్యదర్శి నేతల రమేష్‌బాబు మాట్లాడారు. కె.హెరాల్డ్‌బాబు, జె.శివకృష్ణ, ఎం.నికోల, స్వచ్ఛంద సే వా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

'గేట్'లో విద్యార్థుల ప్రతిభ

ఆర్జీయూకేటీ విద్యార్థులకు 1,000లోపు 30 ర్యాంకులు



అమిరెడ్డి అశోక్



సాయి చరణ్

నూజివీడు: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్)లో ఆర్జీయూకేటీ పరిధి లోని నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని రిజిస్ట్రార్ సంద్ర అమరేంద్రకుమార్ గురువారం తెలిపారు. 400 మంది ఉత్తమ ర్యాంకులు సాధించారని చెప్పారు. నూజివీడు ట్రిపుల్ ఐటీకి చెందిన కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థి అమిరెడ్డి అశోక్ జాతీయ స్థాయిలో 12వ ర్యాంకు సాధించాడన్నారు. ఈసీఈ విద్యార్థులు 125, 201, 655, 679, 875, 907 ర్యాంకులు, సీఎస్ఈ విద్యార్థులు 182, 241, 298, 308, 342, 475, 663, 680, 724, 783, 844, 915, 983, మెకానికల్ విద్యార్థులు 174, 240, 242, 484, 491, 585, కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు 12, 666 ర్యాంకులతో సత్తాచాటారన్నారు. తాము చేపట్టిన గేట్-25 సపోర్ట్ కార్యక్రమమే విజయానికి కారణమని సెంట్రల్ ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్, హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ కాంపిటీటివ్ ఎగ్జామ్ సెల్ కో-ఆర్డినేటర్ ఎం.రామకృష్ణ తెలిపారు. విద్యార్థులతో పాటు శిక్షణకు తోడ్పడిన ఈఐటీపీ సెల్ డీన్ పి.శ్యామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సాయిచరణ్‌కు 9వ ర్యాంక్

కైకలూరు: గేట్ పరీక్షలో కలిదిండి మండలం ఆరుతెగలపాడుకి చెందిన చిలుకూరి సాయి చరణ్ 9వ ర్యాంకు సాధించాడు. చిలుకూరి కిషోర్‌బాబు కుమారుడు చరణ్ కాకినాడ జేఎన్‌టీయూలో ఇంజనీరింగ్ పూర్తిచేసి హైదరాబాద్‌లో గేట్ కోచింగ్ తీసుకున్నాడు. తొలి ప్రయత్నంలోనే ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో 77.67 శాతం మార్కులతో తొమ్మిదో ర్యాంకు సాధించాడు.

నీటి ఎద్దడి ఆవరించేను



నెర్రలు తీసిన భూమిని చూపుతూ..

ఆరుగాలం కష్టించినా అన్నదాతకు సాగులో ఇబ్బందులు తప్పట్లేదు. చివరి దశలోనూ నీటి సమస్యలు వెంటాడుతుండటంతో చేతికందిన పంటను కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నాడు. పొలాలకు నీరందించే విషయంలో అధికారుల సమన్వయ లోపం వీరికి శాపంలా మారింది. దెందులూరు మండలం పాలగూడెం శివారు పొలాలు నీటి ఎద్దడితో నెర్రలు తీశాయి. దీంతో కొవ్వలి డ్రెయిన్‌లో ఉన్న కొద్దిపాటి నీటిని మోటార్లతో తోడుకుంటూ చేలకు అందిస్తున్నారు. ఎకరాకు అదనంగా రూ.3 వేల వరకు ఖర్చు అవుతుందని, మునుపెన్నడూ లేనివిధంగా నీటి కోసం అవస్థలు పడుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



నీటిని మోటార్లతో తోడుతూ..



పొలంలోకి వేసిన పైపు

క్లుప్తంగా

27 నుంచి గుంటూరులో వ్యవసాయ ప్రదర్శన


డాక్టర్ కె. ఫణి కుమార్

ఏలూరు(మెట్రో): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈనెల 27 నుంచి 29 వరకు లాంఫామ్ గుంటూరులో దక్షిణ భారత ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఏరువాక కేంద్రం ఏలూరు సమన్వయకర్త డాక్టర్ కె. ఫణికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాల వ్యవసాయ పద్ధతులు, కూరగాయలు, పండ్ల సాగులో అధునాతన సాగు పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ల వినియోగం తదితర అంశాల ప్రదర్శనతోపాటు రైతుల–శాస్త్రవేత్తల చర్చా కార్యక్రమాలు ఉంటాయన్నారు. దక్షిణ భారత వ్యవసాయ నిపుణులు రైతులతో సంభాషించనున్నట్లు వెల్లడించారు.

ఏలూరులో సినిమా షూటింగ్ ప్రారంభోత్సవం

ఏలూరు (ఆర్ఆర్పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీసిద్ధి ధాత్రి మూవీ క్రియేషన్స్ బ్యానర్పై ప్రొడక్షన్ నెంబర్ 2 చిత్ర రూపకల్పనకు గురువారం ప్రారంభ పూజ చేశారు. సెంటిమెంట్, హర్రర్, కామెడీ మేళవించి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు దర్శకుడు వెంకట్ జుత్తిగ తెలిపారు. ఈ చిత్రం షూటింగ్ నిరంతరాయంగా కొనసాగిస్తామని, జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే లొకేషన్లు పరిశీలించినట్లు చెప్పారు. ఈ చిత్రంలో ఇరువురు ప్రముఖ సీనియర్ నటులు ప్రధాన పాత్రల్లో నటిస్తారని, వారి వివరాలు, హీరోయిన్ల వివరాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. సినీ నిర్మాత వట్టి శ్యామ్బాబు మాట్లాడుతూ అనన్య చిత్రంలో విలన్ క్యారెక్టర్లో నటించిన అరవింద్ జాలా తమ చిత్రంలో హీరోగా నటిస్తున్నట్లు చెప్పారు. తొలుత ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి కొబ్బరికాయ కొట్టి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రముఖ సినీ నిర్మాత అంబికా కృష్ణ క్లాప్ కొట్టి చిత్రీకరణను ప్రారంభించి చిత్రం ప్రజాదరణ పొందాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

ఆదుకోకోంటే ఉద్యమమే

- రాష్ట్రస్థాయి సదస్సులో తేల్చిచెప్పిన కోకో రైతులు
- కోకో గింజల కొనుగోలు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్
- విజయరాయిలోని సదస్సుకు పెద్ద సంఖ్యలో కోకో రైతుల హాజరు


విజయరాయిలో నిర్వహించిన కోకో రైతుల రాష్ట్ర సదస్సులో గిట్టుబాటు ధర సాధిద్దామంటూ చేయి కలిపిన రైతులు

పెదవేగి : కోకో గింజల కొనుగోలు సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని కోకో రైతుల రాష్ట్ర సదస్సు హెచ్చరించింది. గురువారం ఏలూరు జిల్లా పెదవేగి మండలం విజయరాయి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సును నిర్వహించారు. బొల్లు రామకృష్ణ, బోళ్ల సుబ్బారావు, ఈడ్పుగంటి శ్రీనివాసరావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈ సదస్సులో కోకో రైతుల సమస్యలపై చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్ తదితర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో కోకో రైతులు ఈ సదస్సుకు హాజరయ్యారు.

కంపెనీల సిండికేట్తో దోపిడీ

కోకో గింజల కొనుగోలు కంపెనీలు సిండికేట్గా మారి రైతులను దోపిడీ చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కోకో గింజల కొనుగోలు సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 75 వేల ఎకరాల్లో కోకో తోటల సాగు ఉందని, ఏలూరు జిల్లాతో పాటు తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొబ్బరి, ఆయిల్పామ్ తోటల్లో కోకో అంతర పంటగా ఉందని తెలిపారు. ప్రపంచ కోకో ఉత్పత్తిలో మన దేశం ప్రపంచంలోని 20 దేశాల్లో 20వ స్థానంలో ఉందని, మన దేశ అవసరాలకు తగిన విధంగా ఇక్కడ ఉత్పత్తి లేదని చెప్పారు. 80 శాతం కోకోను ఇతర దేశాల నుంచి మన దేశం దిగుమతి చేసుకుంటోందని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. గత సంవత్సరం కంపెనీలు పోటీపడి అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా కిలో గింజలను రూ.1,040 వరకు ధర చెల్లించి కొనుగోలు చేశాయని గుర్తుచేశారు. ఈ ఏడాది కంపెనీలు సిండికేట్గా మారి అంతర్జాతీయ ధర ఇవ్వడం లేదని చెప్పారు. పైగా అన్ సీజన్ గింజలు కొనుగోలు చేయడం లేదని, సీజన్ కోకో గింజల ధర రోజురోజుకీ తగ్గించి వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.


రాష్ట్ర నలుమూలల నుంచి పాల్గొన్న రైతులు

కోకో రైతులు సంఘటితం కావాలి

కోకో రైతులంతా సంఘటితంగా లేకపోవడం వల్లే కంపెనీలు సిండికేట్గా ఇబ్బంది పెడుతున్నాయని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. నిల్వ ఉంచిన గింజలను పచ్చళ్లు పెట్టుకోండి అంటూ రైతులను ఎగతాళి చేస్తూ కంపెనీలు మాట్లాడుతుండటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ఈ సదస్సులో విజయరాయి ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త మాధవీలత, పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం పరిధి ఆయిల్ పామ్ రైతుల సంఘం అధ్యక్షుడు ఉండవల్లి వెంకటరావు, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షుడు మున్నంగి సుబ్బారెడ్డి, కోకో రైతులు పాల్గొన్నారు.

సదస్సు తీర్మానాలివీ..

- అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా రైతుల వద్ద ఉన్న కోకో గింజలను కంపెనీలు వెంటనే కొనుగోలు చేయాలి.
- కంపెనీలు రైతులను నష్టపరిచే చర్యలను అరికట్టాలి.
- కంపెనీలు కొనుగోలు చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వమే కోకో గింజలను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.
- ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేయాలి.
- విదేశీ కోకో గింజలు, పొడి, బట్టర్ వంటి దిగుమతులు నిలుపుదల చేయాలి. మన రైతులను నష్టపరిచే పద్ధతుల్లో దిగుమతులు ఉండరాదు.
- కోకో రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణం చేయాలి.
- కోకో తోటలు సాగు చేస్తున్న రైతులకు ఉద్యాన శాఖ నుంచి రావాల్సిన సబ్సిడీ బకాయిలు చెల్లించాలి.

24న ధర్నాలు, రాస్తారోకోలు..

కోకో రైతుల సమస్యలపై ఈ నెల 24, 25 తేదీల్లో ధర్నాలు, రాస్తారోకో కార్యక్రమాలు నిర్వహించాలని, ఎంపీలు ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు అందించాలని, సమస్యను పరిష్కరించకపోతే కోకో గింజలు కొనుగోలు చేస్తున్న కంపెనీల గోడౌన్ల ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర సదస్సు పిలుపునిచ్చింది.

సునీతా విలియమ్స్కు శుభాకాంక్షలు



ఏలూరు (టూటౌన్): అగ్గిపుల్లపై వ్యోమగామి సునీతా విలియమ్స్ చిత్రాన్ని చిత్రీకరించి అబ్బురపరుస్తున్నారు ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్బాబు. తొమ్మిది నెలలు అంతరిక్షంలో గడిపి క్షేమంగా భూమిపైకి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని తనదైన శైలిలో సునీతా విలియమ్స్కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్ బాబుకు పలువురు అభినందనలు తెలియజేశారు.

కబడ్డీ పోటీల్లో తృతీయ స్థానం

పెదపాడు : వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో ఈనెల 14 నుంచి 16 వరకు జరిగిన 34వ సబ్జూనియర్ అంతర్ జిల్లా బాలబాలికల కబడ్డీ పోటీల్లో పెదపాడు మండలం వీరమ్మకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తృతీయ స్థానం సాధించినట్లు హెచ్ఎం రాంప్రసాద్ తెలిపారు. కబడ్డీ పోటీల్లో విద్యార్థులు హర్ష, శాంతరాజు ప్రతిభ చాటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

గేదెలను తరలిస్తున్న వ్యాన్ అడ్డగింత


గేదెలను వ్యాన్ నుంచి దింపి కట్టేసిన దృశ్యం

తణుకు అర్బన్ : తణుకు జాతీయ రహదారి శర్మిష్ట సెంటర్లో 5 గేదెలతో వెళ్తున్న వ్యాన్ను గోసేవా సమితి సభ్యులు అడ్డుకున్నారు. గురువారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో గోసేవా సమితి సభ్యుడు కొండ్రెడ్డి శ్రీనివాస్, ఇతర సభ్యులు వ్యాన్ను అడ్డుకుని పోలీసులకు సమాచారం అందజేశారు. వ్యాన్లో ఉన్న గేదెలను తేతలి పశువధ శాలకు తీసుకువెళ్తున్నామని, మరలా నూజివీడులో పెంపకానికి తీసుకువెళ్తున్నామని వ్యాన్ డ్రైవరు రెండు రకాల సమాధానాలు చెప్పారని గోసేవా సమితి సభ్యులు ఆరోపిస్తున్నారు. ఐదింటిలో పాలిచ్చేవాటితోపాటు సూడి, పెయ్యి కూడా ఉన్నాయని.. పెంపకానికి తీసుకెళితే ఇలా వ్యాన్లో ఇరికించరని.. వీటిని వధించే ఫ్యాక్టరీకి తీసుకువెళ్తున్నారని ఆరోపించారు. గేదెలకు సంబంధించిన వ్యక్తులు మాత్రం పి.గన్నవరం బెల్లంపల్లి గ్రామం నుంచి నూజివీడుకు పెంపకానికి తీసుకువెళ్తున్నట్లుగా చెబుతున్నారు. దీనిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా ప్రాంతానికి వచ్చిన పోలీసులు వ్యాన్ నుంచి గేదెలను దింపి వాటిని అక్కడే చెట్ల వద్ద ఉంచారు. గేదెలను గోశాలకు పంపిస్తామని, నిబంధనలకు విరుద్ధంగా 5 గేదెలను ఒక వ్యాన్లో ఎక్కించినందుకు మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్కు వ్యాన్ను అప్పగిస్తామని తణుకు పట్టణ ఎస్సై శ్రీనివాస్ చెప్పారు.

నకిలీ బంగారం అంటగడుతున్న ముఠా అరెస్టు

- గోల్డ్ షాపులే టార్గెట్గా మోసాలు
- కైకలూరు పోలీసులకు చిక్కిన ఘరానా కేటుగాళ్లు


కైకలూరు టౌన్ పోలీసు స్టేషన్లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సైలు

కైకలూరు: బంగారపు దుకాణాల వద్దకు కారులో దర్జాగా వెళతారు.. అత్యవసరం అంటూ రూ.3 లక్షల విలువ చేసే బ్రాస్లెట్ తాకట్టు పెట్టుకుని కేవలం రూ.1.50 లక్షలు ఇవ్వండనీ అడుగుతారు. హాల్మార్క్ గుర్తుతో పాటు హైదరాబాద్లో కొనుగోలు చేసిన రశీదు ఇస్తారు. చివరకు అది ఒన్ గ్రామ్ బంగారంగా తేలుతోంది. ఈ విధంగా ఏలూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలో మోసాలకు పాల్పడిన ముఠాను కైకలూరు టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టౌన్ సీఐ పి.కృష్ణ, ఎస్సైలు డి.వెంకట్కుమార్, డి.శ్రీనులతో కలసి కేసు వివరాలను స్టేషన్లో గురువారం వెల్లడించారు. నెల్లూరు జిల్లా రామవరప్పాడుకు చెందిన కడియాల వెంకటేశ్వరరావు(40) భార్యతో కలసి హైదరాబాదు ఎల్బీ నగర్లో ఒన్ గ్రామ్ బంగారం దుకాణం నడుపుతున్నాడు. పెద్ద తిరుపతిలో కొండ పైకి భక్తులను జీపుల్లో తరలించే విజయనగం జిల్లా మెంటాడకు చెందిన చొక్కాపు మణికంఠ(32), నెల్లూరు జిల్లా కావలికి చెందిన ఉన్నం చంద్రమోహన్(54)లను కలుపుకుని వెంకటేశ్వరరావు మోసాలకు పాల్పడుతున్నాడు. ఈ నెల 13న కైకలూరు మహాలక్ష్మీ గోల్డ్ షాప్లో బ్రాస్లెట్ తాకట్టు పెట్టి రూ.90 వేలు యజమాని మెంట దీలిప్ నుంచి తీసుకున్నారు. తర్వాత సమీపంలోని కార్తికేయ ఫైనాన్స్ యజమాని శివవరప్రసాద్కు చైన్ తాకట్టు పెట్టి రూ.1,50 లక్షలు తీసుకున్నాడు. ఆ సమయంలో అతనికి అనుమానం రావడంతో చాకుతో బెదిరించి పరారయ్యారు. తర్వాత భీమవరంలో రూ.1.50 లక్షలు, గుడివాడలో రూ.1.50 లక్షలు, గణపవరంలో రూ.1.30 లక్షలకు నకిలీ బంగారు వస్తువులు అంటగట్టి నగదుతో పరారయ్యారు. తిరిగి కైకలూరులో మోసాలకు పాల్పడడానికి గురువారం వచ్చిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.88 వేలు నగదు, 4 చైన్లు, 4 బ్రాస్లెట్లు, 3 సెల్ఫోన్లు, తెలంగాణ రిజిస్ట్రేషన్ కలిగిన కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్థానిక కోర్టులో హాజరుపర్చి రిమాండ్కు తరలించారు. కేసును ఛేదించిన సీఐ పి.కృష్ణ, ఎస్సైలు డి.వెంకట్కుమార్, డి.శ్రీనులను ఎస్పీ అభినందించారు.

ఆర్టీసీ రక్షణకు 24న చలో ఢిల్లీ


ఏలూరు డిపో గ్యారేజ్ వద్ద పోస్టర్ ఆవిష్కరణ

ఏలూరు (ఆర్ఆర్పేట): దేశంలోని రవాణా రంగ కార్మికులకు ఒక సమగ్ర సంక్షేమ చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న చలో పార్లమెంట్ కార్యక్రమానికి ఆలిండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. లింగరాజు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల స్థానంలో దేశవ్యాప్తంగా విద్యుత్ బస్సులను తీసుకొని భవిష్యత్తులో ఆర్టీసీలను కనుమరుగు చేయాలని కేంద్ర ప్రభుత్వం పథకం వేసిందనీ, ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన పీఎం– ఈ బస్సు స్కీము కూడా ఇందులో భాగమే అన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాడి ఆర్టీసీలను కాపాడుకోవాలనీ, ఈనెల 24న ఢిల్లీలో భారీ ప్రదర్శనతో నిరసన కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్వీడీ ప్రసాద్, ఎస్డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి టీపీఆర్ దొర, ఎస్బీ అనిల్ కుమార్, జిల్లా కార్యదర్శి ఎన్.సురేష్, డిపో అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ ప్రసాద్, టీకే రావు తదితరులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష, జరిమానా

నూజివీడు: చెక్కు చెల్లని కేసులో ఒక వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు ముసునూరు మండలం కాట్రేనిపాడుకు చెందిన ముసునూరు ప్రభుదాస్కు గోపవరంనకు చెందిన వల్లభనేని గోపాలకృష్ణ 2017 జూన్ 25న రూ.5 లక్షలు అప్పుగా ఇచ్చాడు. కొంతకాలం తరువాత బాకీ చెల్లించే నిమిత్తం ప్రభుదాస్ రూ.5 లక్షల చెక్కు ఇచ్చాడు. ఈ చెక్కును గోపాలకృష్ణ బ్యాంకులో వేయగా ప్రభుదాస్ బ్యాంకు ఖాతాలో నగదు లేదని బ్యాంకు అధికారులు చెక్కును తిప్పి పంపారు. దీంతో గోపాలకృష్ణ కోర్టులో కేసు వేయగా విచారణ అనంతరం స్పెషల్ మేజిస్ట్రేట్ ప్రభుదాస్కు ఆరు నెలల జైలుశిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు.

అనుమానాస్పద స్థితిలో రిటైర్డ్ ఉద్యోగి మృతి

చింతలపూడి: చింతలపూడి నగర పంచాయతీ పాత చింతలపూడి గ్రామంలో రిటైర్డ్ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డి హేమ ప్రకాష్(65) రిటైర్డ్ ఉద్యోగి. పాత చింతలపూడిలో నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం గుండెపోటు వచ్చిందని కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. అప్పటికే ప్రకాష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా హేమ ప్రకాష్ను ఆస్తి కోసం కుటుంబ సభ్యులే కొట్టి చంపారని మృతుని సోదరుడు మోహన్ ప్రకాష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ప్రకాష్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అనుమానాస్పద కేసుగా నమోదు చేసి ఎస్సై కుటుంబరావు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ క్షేత్రాల సందర్శన


మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానంలో క్షేత్ర సందర్శన చేస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

పెనుమంట్ర: రబీలో రైతులు ఎదుర్కొనే ప్రధాన సమస్య మిల్లింగ్లో గింజ విరిగిపోయి నూక ఎక్కువగా రావడం వల్ల కొనుగోలు ధర తగ్గిపోతుందని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సంచాలకులు డాక్టర్ టి శ్రీనివాస్ అన్నారు. గురువారం మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంటీయూ 1121 రకం పంటకాలం 125 రోజుల మాత్రమే అని, నిర్ణీత పంటకాలం పూర్తికాగానే పంటను కోయాలన్నారు. పూర్తిగా ఎండిపోయే వరకు చేనుపై ఉంచరాదన్నారు. ఈనెల 26 నుండి 29 వరకు గుంటూరు లాం ఫారంలో ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన జరుగుతుందని, దీనిలో దక్షిణ రాష్ట్రాల రైతులు పాల్గొంటారని చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జడ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో ఏప్రిల్ మొదటివారం నుంచి కోతలు మొదలు అవుతాయన్నారు. నూతన ఎన్ఎల్ఆర్ 3238 రకం ఆశాజనకంగా ఉందని, ఎటువంటి చీడపీడలు లేవని తెలిపారు. చిరుసంచి ప్రదర్శనలో ఉన్న ఎంటీయూ 1426 రకం గుణగణాలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం గిరిజారాణి సాగులో ఉన్న వివిధ రకాల గుణగణాలు, ప్రత్యామ్నాయ రకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎంవీ కృష్ణాజీ, శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

తుది దశకు టెన్నిస్ పోటీలు

భీమవరం: భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్ గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న వెర్టెక్స్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు తుది దశకు చేరుకున్నాయి. గురువారం నిర్వహించిన పోటీల్లో ఫలితాలు ఇలా ఉన్నాయి. 75+ డబుల్స్ విభాగంలో అశోక్రెడ్డి–సాయి రాంబాబు, 70+ డబుల్స్ విభాగంలో సన్యాసిరాజు–గజపతి, 65+ డబుల్స్ విభాగంలో ఆనంద స్వరూప్– శ్రీనివాస్ జోడి విజయం సాధించారు. 65+ సింగిల్స్ విభాగంలో వి.శ్రీనివాసరెడ్డి, 70+ సింగిల్స్ విభాగంలో సేతు విజేతలుగా నిలిచారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఏలూరు (టూటౌన్): రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్సై పి.సైమన్ తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు పవర్పేట రైల్వే స్టేషన్ నందు రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు కృష్ణా జిల్లా వేల్పూరుకు చెందిన నంబూరి రవికుమార్(57)గా గుర్తించినట్లు చెప్పారు. రవికుమార్ మృత దేహాన్ని ఏలూరు సర్వజన ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచామని, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఏకపక్షంగా గేదెల పాక తొలగింపు


పూరిపాకను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

నూజివీడు: తుక్కులూరులో పదేళ్లుగా రెవెన్యూ పోరంబోకు భూమిలో ఉన్న గేదెల పూరి పాకను రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ పాక వైఎస్సార్సీపీ సానుభూతి పరుడైన కొలుసు భాస్కరరావుకు చెందినది కావడంతో ఈ నెల 18న అధికారులు ఆఘమేఘాలపై వచ్చి తొలగించడం గమనార్హం. అదే గ్రామంలో మచిలీపట్నం–కల్లూరు జాతీయ రహదారి మార్జిన్లను ఆక్రమించుకొని అనేక దుకాణాలున్నప్పటికీ వాటి వైపు మాత్రం రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. కొలుసు భాస్కరరావు వైఎస్సార్సీపీ సానుభూతిపరుడుగా ఉండటమే కాకుండా అతని భార్య గ్రామంలో అమూల్ పాలకేంద్రాన్ని నడుపుతోంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అమూల్ కేంద్రాన్ని వదిలేయమని ఆమెపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దానికి నిరాకరించడంతో తమ మాట వినడం లేదని చెప్పి రెవెన్యూ అధికారులపై ఒత్తిడి చేయించి గేదెల పాకను తొలగించేలా చేశారు. దీంతో భాస్కరరావు తన గేదెలను కట్టేసుకోవడానికి స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

క్లుప్తంగా

ఏరియా ఆసుపత్రిలో సై-టీబీ పరీక్షా సేవలు



మాట్లాడుతున్న ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ తాతారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రపంచాన్ని వణికిస్తున్న క్షయ వ్యాధిని నిర్ధారించడానికి సై-టీబీ అనే అధునాతన పరీక్ష విధానం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో అందుబాటులో ఉందని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాతారావు వెల్లడించారు. ఆసుపత్రిలో గురువారం ఆయన మాట్లాడుతూ పరీక్షలో టీబీ వ్యాధి నిర్ధారణ ముందస్తు చికిత్స అందించడం జరుగుతుందని చెప్పారు. టీబీ వ్యాధిని సమాజం నుంచి రూపుమాపవచ్చునని వెల్లడించారు. టీబీ రోగికి ప్రతి నెల రూ.1,000 చొప్పున చికిత్స కాలంలో ప్రభుత్వం పోషణ నిమిత్తం అందజేస్తుందని, టీబీ ఉన్నవారు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు గిరిబాబు, కృష్ణ, నాగలక్ష్మి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ విధానంతో అదనపు భారం

కాళ్ల: క్లస్టర్ కుదింపు విధానంతో వీఆర్‌ఓలపై అదనపు భారం పడుతుందని పాత విధానాన్నే కొనసాగించాలంటూ వీఆర్‌ఓల సంఘం రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు కాళ్ల తహసీల్దార్ జి.సుందర్ సింగ్‌కు వీఆర్‌ఓలు గురువారం వినతిపత్రం అందజేశారు. రెండు గ్రామాలకు ఒకే వీఆర్‌ఓ పనిచేయాల్సి వస్తుందని, ఈ విధానాన్ని నిలుపుదల చేసి పాత విధానం అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఇప్పటికే పని ఒత్తిడిలో ఉన్న వీఆర్‌ఓలు మరింత ఇబ్బందులు గురవుతారన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీకిరణ్, వీఆర్వోలు కెనడీ, సుబ్రహ్మణ్యం, సుధాకర్, హుస్సేన్, రాజశేఖర్, సాయి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్ పేరుతో జరుగుతున్న క్లస్టర్ విధానం వల్ల వీఆర్‌ఓలకు పనిభారం పెరుగుతుందని వీఆర్‌ఓలు వాపోయారు. క్లస్టర్ విధానం కంటే ప్రస్తుతం ఉన్న విధానాన్ని కొనసాగించాలని తహసీల్దార్ నడింపల్లి భారతీవి జయలక్ష్మికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పాలకోడేరు మండల వీఆర్‌ఓ సంఘ అధ్యక్షుడు పి.సురేష్, కార్యదర్శి భోగేశ్వరరావు, వీఆర్‌ఓలు కోటేశ్వరరావు, జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని స్కూల్ నడపొద్దు

ఆకివీడు: స్థానిక జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఒక ఇంట్లో అనుమతి లేకుండా స్కూల్ నడుపుతున్న విషయాన్ని ఏబీవీపీ గుర్తించి మండల, జిల్లా విద్యాశాఖ అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక ఎంఈఓ-2 సీతారామయ్య, ఇతర సిబ్బంది ఆ ప్రాంతానికి వచ్చి పరిశీలించగా ఇండియన్ డిజిటల్ స్కూల్, షిర్డీ సాయి కాన్వెంట్ పేర్లతో నడుపుతున్నట్లుగా గుర్తించామన్నారు. వీటికి గుర్తింపులేదని, అనుమతి లేకుండా నడపవద్దని హెచ్చరించి, ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారికి తెలియజేస్తామని ఎంఈఓ సీతారామయ్య చెప్పారు. ఏబీవీపీ రాష్ట్ర కన్వీనర్ పాండవ సాయి, మండల ఉపాధ్యక్షులు అభిషేక్, షాలిమ్ రాజు పాల్గొన్నారు.

మోగల్లు ప్రభుత్వ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

పాలకోడేరు: మోగల్లు ప్రభుత్వ కాలనీలో సమస్యలు తక్షణం పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వ కాలనీని సీపీఎం బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ మండలంలో అతిపెద్ద లే అవుట్ లో మోగల్లు ఒకటన్నారు. ఈ కాలనీలో 700కు పైగా ఫ్లాట్ లు ఉండగా సుమారు 450పైగా నివసిస్తున్నారు అని అన్నారు. కనీస మౌలిక వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కె.క్రాంతి బాబు, మండల కార్యదర్శి శేషపు అత్రియ్య, గ్రామ కార్యదర్శి పాలా వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్ పునఃప్రారంభం

ఆకివీడు: మండలంలోని కొల్లేరు తీర గ్రామం చినమిల్లిపాడులో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఎట్టకేలకు గురువారం ఎస్సై హనుమంతు నాగరాజు, ఉపసర్పంచ్ గురుదాసు బాలాజీ పునఃప్రారంభించారు. గత వారం రోజులుగా మంచినీటి వాటర్ ప్లాంట్ ప్రారంభానికి రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత టీడీపీకి చెందిన నాయకులు ఆర్‌ఓ ప్లాంట్‌ను తామే నడుపుతామని తాళాలు తీసుకున్నారన్నారు. ఎనిమిది నెలల తర్వాత గ్రామంలోని పెద్దలంతా కలిసి వాటర్ ప్లాంట్‌ను తామే నడుపుతామని చెప్పి ముందుకు రావడంతో గతంలో తాళాలు తీసుకున్న వ్యక్తులు అడ్డుపడ్డారు. తామే నడుపుతామని మళ్లీ ముందుకు వచ్చారు. పంచాయతీ కార్యదర్శి ద్వారా ప్లాంట్‌ను నడిపించాలని నిర్ణయం తీసుకుని గ్రామస్తులు సమష్టిగా ఎస్సై నాగరాజు, ఉప సర్పంచ్(వైఎస్సార్‌సీపీ) బాలాజీలతో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభించారు.

తణుకులో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర సాధ్యమేనా!



తణుకు 19వ వార్డు కట్టమూరి వారి వీధిలో రోడ్డుపై పేరుకున్న చెత్త

- రోడ్లపైనే చెత్తకుప్పలు.. మురుగు, లార్వాతో నిండిన డ్రెయిన్‌లు
- పారిశుద్ధ్య నిర్వహణలో మల్లగుల్లాలు
- లోపించిన శానిటరీ అధికారుల పర్యవేక్షణ

తణుకు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తణుకులో మొదలుపెట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర నినాదానికి పారిశుద్ధ్య నిర్వహణ తీరు ఆటంకంగా కనిపిస్తోంది. ఈనెల 15వ తేదీన తణుకులో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తణుకు ప్రజానీకానికి చెత్తలు రోడ్లపై వేయరాదని, పారిశుద్ధ్య కార్మికులకు అందించాలంటూ పిలుపునిచ్చారు. ఇక్కడవరకు బాగానే ఉన్నా ఇంటి చెత్త నేరుగా కంపోస్టు యార్డుకు వెళ్లే నిర్వహణ తణుకులో గాడి తప్పడంతో చాలా వీధుల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా గతంలో లేని విధంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం వివిధ కూడళ్లలో చెత్త డంపింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి స్వయంగా పారిశుద్ధ్య కార్మికులు ఇంటి చెత్త సేకరించి డంపింగ్ ప్రాంతంలో వేయడంతో సమస్య తీవ్రరూపం దాల్చింది. దీంతో ప్రజానీకం సైతం మాకు చెప్పడం కాదు చెత్త సేకరణలో మీకు చిత్తశుద్ధి లేకుండా పోయిందని మా ఇళ్ల ముందు చెత్త పాయింట్లు ఏర్పాటు చేసి మురికికూపంగా మారుస్తున్నారంటూ కార్మికులను నిలదీస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 10 నెలల కాలంలో తణుకు ప్రాంతాన్ని మురికికూపంగా మార్చేశారంటూ ప్రజానీకం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లపైనే చెత్త...


తణుకు మునిసిపాలిటీలోని 34 వార్డుల్లో కొన్ని రహదారుల్లో చెత్తకుప్పలు నిల్వ ఉండడం ఇటీవల కాలంలో పరిపాటిగా మారింది. అంతేకాకుండా డ్రెయినేజీల్లో సైతం మురుగునీరు పారకపోవడంతో తీవ్ర దుర్గంధంగా మారిందని, కనీసం కార్మికులు పారవేసి లాగే పరిస్థితి కూడా లేకుండా పోయిందంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. పట్టణ పరిధిలోని డ్రెయినేజీల్లో అధిక శాతం మురుగునీరు కదలిక లేకపోవడంతో లార్వా విజృంభిస్తుందని తద్వారా దోమల ఉధృతి పెరుగుతుందని చెబుతున్నారు.



తణుకులో పాలిథీన్ కవరులో నిమ్మకాయిలు తీసుకువెళ్తున్న దృశ్యం

పారిశుద్ధ్య నిర్వహణలో రాజకీయ ముసుగు..

పారిశుద్ధ్య నిర్వహణలో ఉన్న శానిటరీ మేస్త్రీల్లో కొందరు రాజకీయ ముసుగులో ఉండడంతో అటువంటి వారిపై మునిసిపల్ అధికారులు దృష్టి సారించలేకపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు మేస్త్రీలు రాజకీయ పెద్దల ఆశీస్సులతో పాటు వారిని ప్రసన్నం చేసుకున్న నేపథ్యంలో వారిపై పూర్తిస్థాయి పర్యవేక్షణ అధికారులు చేయడంలేదని విమర్శలు అధికంగా వినిపిస్తున్నాయి. సదరు మేస్త్రీలు కార్మికుల మస్తర్లలో కూడా అవకతవకలకు పాల్పడుతున్నా చూసీచూడనట్లుగా వ్యవహరించాల్సి వస్తున్నట్లుగా సమాచారం.



తణుకు రూట్స్ స్కూలు రోడ్డులో మురుగు, చెత్త వ్యర్థాలతో నిండిన డ్రెయిన్

ప్లాస్టిక్ వినియోగంపై పర్యవేక్షణ ఎక్కడ..

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలంటూ స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పిలుపునివ్వగా దీనికి సంబంధించి తణుకులో మాత్రం ఎటువంటి పర్యవేక్షణలు జరగడంలేదని తెలుస్తోంది. దుకాణాల వద్ద పాలిథిన్ కవర్ల వాడకంతోపాటు టీ, మంచినీటికి ఉపయోగించే గ్లాసులు సైతం అధికంగా వినియోగిస్తుండడం శోచనీయం. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చేసిన వ్యాఖ్యలు ఏమేరకు ఫలిస్తాయో తణుకు ప్రజానీకం వేచిచూడాల్సిందే.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 33/11 కేవీ హౌసింగ్‌బోర్డు సబ్ స్టేషన్ పరిధిలో రిలయన్స్ ఫీడర్, సత్యవతినగర్ ఫీడర్‌కు సంబంధించి విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 21వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. వన్ టౌన్‌లోని హౌసింగ్‌బోర్డు, శశి కళాశాల, ఎన్‌ఎస్ రాజు లేఅవుట్ ఏరియా, పాలిటెక్నిక్ కళాశాల, గాంధీ బొమ్మ సెంటర్, గణేష్ నగర్, ఏరియా ఆసుపత్రి పరిసర ప్రాంతాలు, సత్యవతినగర్, వీకర్స్‌కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, అబ్బుల కొట్టు సెంటర్‌లలో విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆశీలు వసూలుకు వేలంపాటలో పాల్గొనండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో 2025-26 సంవత్సరానికి గాను తేదీ ఏప్రిల్ 1వ తేదీ 2025 నుంచి 31 మార్చి 2026 వరకు బ్రహ్మానందరెడ్డి మార్కెట్, రోడ్డు మార్జిన్లులలో ఆశీలు వసూలు చేసుకొనుటకు వేలంపాటలో పాల్గొనాలని పాటదారులను మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు కోరారు. గురువారం 11 గంటలకు ఆశీలు వసూలు కోసం బహిరంగ వేలం నిర్వహించగా ఏ ఒక్కరు వేలంపాటలో పాల్గొన లేదని తెలిపారు. దీంతో ఈ నెల 21వ తేదీన శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వేలం నిర్వహించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. ఆసక్తిగల వారు డిపాజిట్, స్టాంప్ డ్యూటీ చార్జీలు కలపి రూ 22,00,000లు డిపాజిట్ చెల్లించి, రూ 50,00,000/- సాల్వెన్సీ దాఖలు పరిచి పాటలో పాల్గొనాలన్నారు. అంతేగాక కబేళా పాట ఆసక్తి ఉన్నవారు డిపాజిట్ రూ. రూ.70,000లు చెల్లించి, సాల్వెన్సీ రూ. 2,00,000లు దాఖలు పరిచి పాటలో పాల్గొనాలని, ఇతర వివరాలకు రెవిన్యూ ఆఫీసర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

అత్తిలిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు లేక అవస్థలు





అత్తిలి రైల్వేస్టేషన్ దృశ్యాలు

అత్తిలి: గతంలో నియోజకవర్గ కేంద్రంగా ఉన్న అత్తిలిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయకపోవడంతో ప్రయాణిలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. సుదూర ప్రాంతాలు రైలు ప్రయాణం చేసేవారికి అత్తిలి మండల పరిధిలోగల గ్రామాల ప్రజలకు అత్తిలి రైల్వేస్టేషన్ ఎంతగానో ఉపయోగపడేది. గతంలో అత్తిలి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేవి. దీంతో హైదరాబాద్, బెంగుళూరు. చెన్నై, తిరుపతి, విశాఖపట్నం, పూరి వంటి పట్టణాలకు అత్తిలి రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణించేవారు. రైల్వే డబ్లింక్ పనులు చేపట్టిన సందర్భంలో అత్తిలి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టును తొలగించారు. అయితే రైల్వే లైన్ ఆధునికీకరణ పనులు పూరై సంవత్సరాలు గడుస్తున్నా అత్తిలి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు పునరుద్ధరించలేదు. దీంతో దూర ప్రాంతాలకు ప్రయాణించే వారు తీవ్ర ఇక్కట్లు పడాల్సివస్తోంది. ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కడానికి అత్తిలి గ్రామానికి 15-20 కిలోమీటర్ల దూరంలో ఉన్న తణుకు, భీమవరం స్టేషన్‌లకు అవస్థలు పడి వెళ్లి రైలు ఎక్కాల్సివస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రైన్ ఎక్కేందుకు తణుకు, భీమవరం స్టేషన్‌లకు చేరుకోవడానికి అదనపు ఖర్చు అవుతోందని చెబుతున్నారు. ఒక్కో సందర్భంలో సరైన సమయానికి చేరుకోలేక ట్రైన్‌లు మిస్సవుతున్నామని ప్రయాణికులు పేర్కొన్నారు. గతంలో మాదిరిగా అత్తిలి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేవిధంగా చర్యలు తీసుకోవాలని పలు రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థలు రైల్వే అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితంలేకుండా పోయింది. గతంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లకు 30 స్టేషన్‌లలో హాల్టులు కలిపించారు. అయితే రైల్వే అధికారులు ప్రకటించిన జాబితాలో అత్తిలి రైల్వేస్టేషన్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర నిరాశకు గురయ్యారు. గత మూడేళ్లుగా అత్తిలి స్టేషన్‌లో ఏఒక్క ఎక్స్‌ప్రెస్ రైలును నిలుపుదల చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. భీమవరం నుంచి నిడదవోలు వరకు మాత్రమే పాసింజర్ ట్రైన్‌లు పడుపుతున్నారని, దీనివల్ల వివిధ పనులపై రాజమండ్రి వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడాల్సి వస్తోందని, నిడదవోలు నుంచి రాజమండ్రి వరకు పాసింజర్ ట్రైన్‌లను పొడిగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మద్యం విక్రయదారుడిపై దాడిలో ఆగంతకుడి గుర్తింపు

తణుకు అర్బన్: మద్యం విక్రయదారుడిపై దాడి చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం తెల్లవారుజామున అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం పాయింట్‌లో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై జరిగిన దాడి తణుకులో సంచలనం రేకెత్తించింది. మద్యం విక్రయిస్తున్న తణుకు పట్టణానికి చెందిన సిర్రా మధు అలియాస్ పండు అనే వ్యక్తిపై జరిగిన దాడికి సంబంధించి సీసీ పుటేజీ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో తణుకు ప్రజానీకం భయాందోళన చెందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం కోసం వచ్చిన వ్యక్తి మద్యం విక్రయిస్తున్న పండుతో వాగ్వాదం పడి వెళ్లిపోయాడని తర్వాత మళ్లీ వచ్చి తనతోపాటు తెచ్చుకున్న ఇనుప రాడ్‌తో విచక్షణారహితంగా దాడిచేయడంతో బాధితుడు అపస్మారక స్థితికి వెళ్లాడు. తణుకులో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తలకు గాయంతోపాటు ముఖంపై పలుచోట్ల ఎముకలు విరిగిపోయాయి. దాడికి పాల్పడిన వ్యక్తిని గుర్తించామని జాతీయ రహదారి పెరవలి రోడ్డులో ఉన్న గేదెల మకాంలో గుమస్తాగా పని చేస్తుంటాడని అతనిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసు బృందం వెళ్లినట్లుగా పట్టణ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.



తణుకులో దాడిలో గాయపడ్డ పండు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

తణుకు అర్బన్: తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో గురువారం గ్రౌండ్ లెవెల్ మస్కిటో బ్రీడింగ్ సోర్సెస్‌ను సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర సాధ్యం కావాలంటే స్వచ్ఛ కార్యచరణ ఇంటి నుంచి ప్రారంభించాలని సూచించారు. దోమల పుట్టుకకు ప్రధానంగా కదలికలేని నీటి నిల్వలు, డ్రెయిన్‌లలో విచక్షణారహితంగా వేస్తున్న చెత్త కారకాలని, చెత్త కేవలం డస్ట్ బిన్‌లో మాత్రమే వేయాలని, ఇంటి పరిసరాలు, రహదారులు, డ్రెయిన్‌లు, ఖాళీస్థలాల్లో వేయరాదని అన్నారు. స్వచ్ఛత పాటిస్తే ఆరోగ్యం - పాటించకపోతే అనారోగ్యం అనే విషయాన్ని ప్రజానీకం గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రెటరీ జి.శాంతకుమారి పాల్గొన్నారు.



తణుకులో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

తణుకు అర్బన్: తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కె.పద్మావతి మాట్లాడుతూ రేడియేషన్, వాతావరణ కాలుష్యం తదితర సమస్యలతో పిచ్చుక జాతి అంతరించుకుపోతుండడం బాధాకరమని అన్నారు. ఈ వేసవిలో పిచ్చుకల కోసం ఇంటి ఆవరణల్లో ప్రతి ఒక్కరూ నీరు, ఆహారం ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా పిచ్చుకలు ఏర్పాటు చేసుకునే వాటి ఆవాసాలను పాడుచేయరాదని కోరారు. అనంతరం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్కూల్ స్టాఫ్ సెక్రటరీ జీజే ప్రభువరం, ఉపాధ్యాయులు అక్కింశెట్టి రాంబాబు, జే. ఉమాదేవి, జి పాల్ డేవిడ్ రాజు, రాధాకుమారి, సురోచనా రాణి, వెంకటలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విజేతలైన విద్యార్థులతో హెచ్‌ఎం పద్మావతి

ఉపన్యాసాలతో మేధస్సు వృద్ధి

ఆకివీడు: ఉపన్యాసాలు ఆయా సబ్జెక్టులలో విద్యార్థుల మేధస్సుకు పదును పెడతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపన్యాస కార్యక్రమాలను గురువారం ఆమె ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆయా సబ్జెక్టులలో అనుభవం కలిగిన అధ్యాపకులు వారి ఉపన్యాసం ద్వారా విద్యార్థులకు మరింత అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. జంగారెడ్డి గూడెంలోని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ కళాశాలకు చెందిన అధ్యాపకులు టీవీ రాంబాబు భౌతిక శాస్త్రంలో 2025 ఇంటర్నేషనల్ క్వాంటమ్ ఇయర్ అనే అంశంపైన, వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ కె.ఉత్తమ్ సాగర్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులపై అవగాహన అంశంపై విద్యార్థులకు ఉపన్యాసం ఇచ్చారు. పాలకొల్లు, డీఎన్నార్ మహిళా కళాశాలలకు చెందిన రసాయన అధ్యాపకులు డాక్టర్ జీ.స్వరూప్ సింగ్, పరివర్తన మూలకాలు-ధర్మాలు అనే అంశాలపై ఉపన్యాసాలిచ్చారు.

ప్రజాసమస్యలపై పోరాడాలి

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ శ్రేణులు పోరాడాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని పడాల గ్రామంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా వాటి పరిష్కారానికి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం గ్రామ కమిటిని నియమించారు. నియోజకవర్గ సోషల్‌మీడియా ఇన్‌ఛార్జి కనుపూరి ఉదయభాస్కర్, నాయకులు సిర్రాపు శాంతకుమార్, కామిశెట్టి వినోద్, లింగంపల్లి వేమన, పులి గోపాలకృష్ణ, ఇంటి రాజబాబు, విప్పర్తి సురేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పడాల గ్రామంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ సేవలు అభినందనీయం

తణుకు అర్బన్: తణుకు రైల్వే స్టేషన్ రోడ్డులోని అమ్మనాంబ ఆశ్రమానికి తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం 4 పరుపులు, దిండ్లు సెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకరచౌదరి మాట్లాడుతూ అసోసియేషన్ చేసే సేవాకార్యక్రమాల్లో భాగంగా ఆశ్రమంలోని వృద్ధుల సౌకర్యార్థం పరుపులు, దిండ్లు అందజేశామని చెప్పారు. ఆశ్రమంలో వృద్ధులను చూస్తున్న తీరు అభినందనీయమని, డబ్బు తీసుకోకుండా వృద్ధులకు ఆసరా కల్పిస్తున్న ఇటువంటి ఆశ్రమాలను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నల్లజర్ల వెంకన్న, భారత్ రాధాకృష్ణ, కార్యదర్శి ఎండీ స్వాలిహ్, కోశాధికారి అర్జి భాస్కరరావు, ఎస్ రామకృష్ణారావు, పార్వతి, గిరజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



తణుకు అమ్మనాంబ ఆశ్రమంలో పరుపులు, దిండ్లు అందజేస్తున్న దృశ్యం

యువత ఆలోచనల్లో మార్పు రావాలి

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

తాడేపల్లిగూడెం: యువత ఆలోచనల్లో మార్పువచ్చినప్పుడే అద్భుత ఆవిష్కరణలు వస్తాయని సీబీఐ మాజీ జేడీ వీ.వీ.లక్ష్మీనారాయణ అన్నారు. వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్రారంభమైన టెక్ఎఫోరియా 2కె25 కార్యక్రమంలో ఆయన అతిథిగా పాల్గొన్నారు. భారతదేశ అభివృద్ధి యువత చేతుల్లోనే ఉందన్నారు. యువత తలచుకుంటే అమెరికన్ దేశస్తులే భారతదేశ ఎంబసీ ముందు నిలబడి వీసాల ఇవ్వడానికి ఎదురుచూసే పరిస్థితి వస్తుందన్నారు. టెక్నాలజీ అనేది రెండువైపులా పదును ఉన్న కత్తి లాంటిదని, దానిని జాగ్రత్తగా వాడాలన్నారు. ఒక పదమూడేళ్ల కుర్రాడు టెక్నాలజీని వాడి హార్ట్ ఎటాక్‌ను ముందే పసిగట్టగలిగే యాప్‌ను తయారు చేశాడన్నారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు, ప్రిన్సిపాల్ రత్నాకర్ రావు, భాస్కరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



వాసవీ టెక్ ఎఫోరియాలో మాట్లాడుతున్న వీ.వీ.లక్ష్మీనారాయణ

పాలిథీన్‌తో ప్రజారోగ్యానికి ముప్పు

భీమవరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రజారోగ్యానికి పెనుముప్పులా తయారైన పాలిథీన్‌ను నిషేధించాలని భీమవరం మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి అన్నారు. గురువారం భీమవరం టూటౌన్‌లోని ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ, క్లాత్ బ్యాగ్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణ రాజు, అధ్యక్షుడు గ్రంధి కుమార వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ భీమవరం పట్టణంలో కలెక్టర్ ఆదేశాలతో మునిసిపల్, ఇతర శాఖల ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థలు, సంఘాల సహకారంతో ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డీకే పుల్లంరాజు, కార్యదర్శి డి శ్రీధర్ రాజు,కోశాధికారి పి పీటర్, గాదిరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రీ-సర్వే పనుల పరిశీలన

ఉండి: రీసర్వే పనులు పారదర్శకంగా వేగంగా జరిగేలా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలో రీ-సర్వే పనులు జరుగుతున్న తీరును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాలకేంద్రం స్థలాలను దానిలో ప్రభుత్వ భవనాలకు కేటాయించిన స్థలాలను ఆయన పరిశీలించారు. అనంతరం రీ-సర్వేకు సంబంధించిన మ్యాప్‌లను ఆయన పరిశీలించి అధికారులకు, సిబ్బంది పలు సూచనలు, సలహాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ-సర్వే పనుల్లో ఎక్కడా నిర్లక్ష్యం లేకుండా నిబంధనల మేరకు పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ స్థలాల గుర్తింపులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఉండాలన్నారు. కొలతల ప్రకారం ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని సూచించారు.



ఎన్నార్పీ అగ్రహారంలో రీసర్వే పనులు పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

9.45 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఆకివీడు: మండలంలోని అప్పారావు పేట గ్రామంలోని రేషన్ షాపు నెం. 0534007లో ఆకస్మిక తనిఖీలు చేయగా 9.45 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించినట్లు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ మహేష్ గురువారం చెప్పారు. గ్రామంలోని షాపు తనిఖీకి వెళ్లగా తాళాలు వేసి ఉన్నాయని, గతంలో కూడా ఇదే విధంగా తాళాలు వేసి ఉండడంతో వెనుదిరిగామన్నారు. ఈ సారి తాళాలను గ్రామ వీఆర్వో బందా హరిశ్చంద్ర ప్రసాద్, ఇతర డీలర్లు, గ్రామ పెద్దల సమక్షంలో తాళం బద్దలకొట్టి పరిశీలించగా బియ్యం లభించినట్లు చెప్పారు. డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశామన్నారు.